క్లుప్తంగా

నేడు వీఎంసీ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్

పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజల ప్రతి సమస్యను పరిష్కరించడానికి వీఎంసీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ ఎస్) నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు చిట్టినగర్‌లో ఉన్న సర్కిల్–1 కార్యాలయం, సత్యనారాయణపురంలో ఉన్న సర్కిల్–2 కార్యలయం, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో కూడా జరుగుతుందని పేర్కొన్నారు. సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తారని వివరించారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం బెంగళూరుకు చెందిన నృత్య విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. బెంగళూరుకు చెందిన మునిపల్లి మహతి పర్యవేక్షణలో సుమారు 19 మంది విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇవ్వగా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళా వేదికపై నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులను పలువురు భక్తులు అభినందించారు. అనంతరం ఆలయ అధికారులు వారికి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

మైనర్ అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మైనర్ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన బ్లాక్ నంబర్ 109లో కొమ్మల బుజ్జి, తిరుపతిరావు దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. కుమార్తె(13) శుక్రవారం రాత్రి ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే స్నేహితుల వద్దకు వెళ్లి ఉంటుందని భావించారు. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ప్రయోజనం లేదు. దీంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

దాసరి జీవితం స్ఫూర్తిదాయకం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రఖ్యాత సినీ దర్శకుడు, నటుడు దాసరి నారాయణరావు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. దర్శకుడిగా, నిర్మాతగా, రచయితగా, నటునిగా, రాజకీయ రంగంలో కేంద్ర మంత్రిగా పనిచేసి సేవలందించారన్నారని కొనియాడారు. ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ దర్శక నిర్మాత డాక్టర్ దాసరి నారాయణరావు 78వ జయంతి వేడుకలు బ్రాహ్మణ వీధిలోని కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో జరిగాయి. కార్యక్రమంలో 20 సూత్రాల అమలు కమిటీ అధ్యక్షుడు లంకా దినకర్, జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు, నటుడు పిల్లా ప్రసాద్, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ల నారాయణ రావు, శారదా కళాసమితి అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు తదితరులు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పలు రంగాలలో జనాదరణ పొందిన నాయకులు దాసరి నారాయణరావు అన్నారు. ఫిల్మ్ ఇండస్ట్రీలో కులాలకు, మతాలకు అతీతంగా పెద్దన్న పాత్ర పోషించారన్నారు. దర్శకుడిగా, నిర్మాతగా, నటుడుగా, కేంద్ర మంత్రిగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. సినీరంగంలో ఆయన ప్రతిభను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గుర్తించి రికార్డ్స్‌లో స్థానం కల్పించిందన్నారు. కార్యక్రమంలో మూర్తి రాజ్, అజయ్ వర్మ, లాయర్ సుభాషిణి, బండేటి శశికుమార్, సోమిశెట్టి ప్రసాద్, దాసరి నారాయణరావు అభిమానులు పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షుడు టి.రాజు కార్యక్రమాన్ని నిర్వహించారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

సమావేశంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. అధ్యక్షుడిగా బండ్రెడ్డి శశికుమార్, ఉపాధ్యక్షుడు మోటేపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కొండదల శివప్రసాద్ రెడ్డి, కోశాధికారి ఉబా ప్రసాద్, కార్యదర్శి బండారు నారాయణరాజు, సహాయ కార్యదర్శి కోనేటి సుధాకర్, కార్యనిర్వాహక కార్యదర్శి అందవరపు ఏడుకొండలు, కార్యవర్గ సభ్యులుగా పూజారి భాస్కర్ రాజు, దాసరిరాజు బాలకృష్ణ, అలంక రవికుమార్, మిర్తిపాటి నరేష్, షేక్ మెహబూబ్ బాషా, బొచ్చు హేమంత్ కిశోర్‌ను నియమించారు.



కృష్ణవేణి మార్కెట్ సమీపంలో డ్రైయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు



డ్రైయిన్‌లో వ్యర్థాలను తరలిస్తున్న దృశ్యం

చినుకు పడితే ముంపే !

- చిన్నపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్న పాతబస్తీ రోడ్లు
- చెత్తాచెదారంతో నిలిచిపోతున్న నీరు
- బిక్కుబిక్కుమంటున్న పాతబస్తీ నివాసితులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చిన్నపాటి వర్షానికి పాతబస్తీలోని పలు వీధులు చెరువులను తలపిస్తున్నాయి. పాతబస్తీ నివాసితులు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వెరసి చిన్న వర్షానికి సైతం వీధుల్లో భారీగా వర్షపునీరు నిలిచిపోతుంది. ఏటా వర్షాకాలంతో పాటు వేసవిలోనూ చోటుచేసుకుంటున్న వర్షాలతో స్థానిక ప్రజానీకం తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. పాతబస్తీ నుంచి మురుగునీరు బయటకు వెళ్లే మార్గాలు సరిగా లేకపోవటంతో పరిస్థితులు ఎప్పటికప్పుడు దారుణంగా తయారవుతున్నాయి. వర్షం కురిసిన సమయంలో సరైన సిబ్బంది విధుల్లో లేకపోతే నీరు బయటకు వెళ్లటం కష్టమేనని స్థానికులు వాపోతున్నారు. అర్ధరాత్రి వేళ వర్షం కురిస్తే సిబ్బంది వచ్చి చెత్తాచెదారం తొలగించినప్పుడే మురుగునీరు బయటకు వెళ్లే పరిస్థితి ఉంటుంది.

డ్రైయిన్లలో చెత్తాచెదారం

పాతబస్తీలో నివాసితులు చెత్తాచెదారం డ్రైయిన్లలో వేస్తుండటంతో తరచుగా సమస్యలు తలెత్తుతున్నాయి. స్థానిక ప్రజానీకం ప్రధానంగా ప్లాస్టిక్ వ్యర్థాలు అత్యధికంగా డ్రైయిన్లలో విచ్చలవిడిగా వేస్తుండటంతో మురుగునీరు బయటకు వెళ్లేందుకు సమయం పడుతుంది. కొన్ని సమయాల్లో చెత్తాచెదారం అడ్డుపడి మురుగునీరు బయటకు వెళ్లటానికి అవకాశం లేకుండా నిలిచిపోతుంది. ముఖ్యంగా సుబ్బరామయ్యవీధి, గణపతిరావురోడ్డు, కుమ్మరివీధులు, గులాంమొహిద్దీన్ వీధి, వించిపేట తదితర ప్రాంతాల్లో డ్రైయిన్లలో భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తుండటంతో తరచుగా నీరు నిలిచి స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తోంది.



కుమ్మరి వీధిలో నిలిచిపోయిన వర్షం నీరు

అధికారుల అలసత్వం..

నగరపాలకసంస్థ అధికారులు పాతబస్తీలో రోడ్ల నిర్మాణం చేసే క్రమంలో తీవ్రమైన అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. రోడ్ల నిర్మాణం చేసేటప్పుడు భౌగోళికంగా ఉన్న పరిస్థితులు, సాంకేతిక అంశాలను గుర్తించకుండా ఎలా పడితే అలా పనులు చేపట్టడంతో మురుగునీరు బయటకు వెళ్లటానికి సమస్యలు ఎదురవుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా ఒక వీధి అధికంగా అవసరాన్ని మించి ఎత్తు లేపటం, కొన్ని వీధులను వదిలేస్తుండటంతో పరిస్థితులు దిగజారుతున్నాయి. దానికి తోడు సరైన ప్రణాళిక లేకపోవటంతో వీధుల్లోని నివాసాల్లోకి సైతం మురుగ నీరు ప్రవేశిస్తుందని ఆయా కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా మురుగునీరు సజావుగా బయటకు వెళ్లేందుకు అవసరమైన నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

7 నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న పోతిన వెంకట మహేష్ దంపతులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆంజనేయ వాగు సెంటర్‌లో వేం చేసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయంలో నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో వై.సీతారామయ్య పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో నూతన ధ్వజస్తంభానికి దాత పోతిన వెంకట మహేష్ దంపతులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చిట్టినగర్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు పూజా కార్యక్రమాలను జరిపించారు. ఈవో సీతారామయ్య మాట్లాడుతూ.. ఆలయంలో నూతన ధ్వజ స్తంభం ప్రతిష్ఠించడానికి వీరాంజనేయ స్వామి వారి అనుజ్ఞ అయిందన్నారు. ఆలయ అర్చకులు పరాశరం పవన్‌కుమార్‌చార్యులు, విన్నకోట శ్రీనివాసరావు శర్మ పర్యవేక్షణలో మురికిపూడి మణిదీప్ శిష్యబృందంచే ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. 7వ తేదీ సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, వాస్తుపూజ జరుగుతాయన్నారు. 8వ తేదీ నవగ్రహ పూజ, అష్టకలశ స్నపన, పంచగవ్యాది వాసం, జలాధివాసం నిర్వహిస్తామని చెప్పారు. 9వ తేదీ ఉదయం 6.51 గంటలకు యంత్రస్థాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ జరుగుతాయన్నారు. ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు.

వైభవంగా పాండురంగడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఎదుర్కోలోత్సవంలో స్వామి వారు



పాండురంగడు, వేణుగోపాలుడు, ధ్రువమూర్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని కొత్తగుళ్ల ప్రాంగణంలో కొలువై ఉన్న పాండురంగడి సన్నిధిలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని శ్రీ రుక్మాబాయి సమేత పాండురంగస్వామి వారి ఆలయంలో త్రయోదశి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఉదయం ఆలయంలోని రుక్మాబాయి సమేత పాండురంగడికి ప్రత్యేక తిరుమంజన అభిషేకాన్ని నిర్వహించారు. అందులో భాగంగా పంచామృతాలు, పలు ఫల, విశేష జలాలతో అభిషేకాలను చేపట్టారు. అనంతరం స్వామి వారిని పెండ్లికుమారునిగా, అమ్మవారిని పెళ్లికుమార్తెగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం హంసవాహనంపై స్వామి వారికి వాహనసేవను జరిపారు. అనంతరం ఎదుర్కోలోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అందులో భాగంగా శేషవాహనంపై స్వామి వారిని అధిష్ఠింపజేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల గుణగణాలను కీర్తిస్తూ ఉత్సవాన్ని జరిపారు. పాండురంగ భజన మండలి ఆధ్వర్యంలో రాత్రి సంకీర్తనగానం జరిగింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజ లు నిర్వహించారు. కార్యక్రమాలను అద్దేపల్లి మురళీకృష్ణమాచార్యులు, పులిపాక రాఘవాచార్యులు, పులిపాక ఆంజనేయచార్యులు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు.

భారీ వర్షంతో అస్తవ్యస్తం

- తీవ్ర ఇబ్బందులు పడిన చిరు వ్యాపారులు, ప్రజలు
- నీట మునిగిన పలు రహదారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో ఆదివారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. భారీ వర్షంతో వన్‌టౌన్‌లోని వీధులన్ని వర్షపునీటితో దర్శనమిచ్చాయి. ఎండలతో అల్లాడుతున్న ప్రజానీకం వర్షంతో సేదతీరారు. భారీగా కురిసిన వర్షంతో ఒక్కసారిగా వర్షపునీరు రావటంతో ఆయా ప్రాంతాల్లో మురుగునీరు నిలిచిపోయింది. దాంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు. అలాగే స్థానిక ప్రజానీకం ఇబ్బందులు పడ్డారు. సుమారు అర పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షం జనజీవనాన్ని స్తంభించింది. అంతేకాకుండా వర్షం కారణంగా పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో రాకపోకలకు విఘాతం కలిగింది. గణపతిరావురోడ్డు, కుమ్మరి వీధులు, సుబ్బరామయ్యవీధి, గులాంమొహిద్దీన్‌వీధి, డ్రైయిన్ వీధి తదితర ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది.



కొత్తపేటలో వర్షపునీరు




సుబ్బరామయ్యవీధిలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

తీవ్ర ఇబ్బందులు పడిన చిరువ్యాపారులు

ఆదివారం కురిసిన భారీ వర్షానికి పాతబస్తీలోని చేపలమార్కెట్‌లోని చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూరగాయాల వ్యాపారులు, ఆదివారం ప్రత్యేకంగా వివిధ వస్తువులను విక్రయించే హాకర్లు, చేపలమార్కెట్ లోపల చేపల విక్రేతలు వర్షంతో నానా తంటాలు పడాల్సి వచ్చింది. బూరాడవారివీధి, గులంమొహిద్దీన్ వీధి, గణపతి రావురోడ్డు, శిల్పజరామంవీధి తదితర ప్రాంతాల్లోని వ్యాపారులు వర్షానికి తడిసి ముద్దయ్యారు. ఒక్కసారిగా కురిసిన వర్షానికి వారి వ్యాపారాలు సైతం దిగజారాయి.







వర్ష బీభత్సం



ఉక్కబోతతో ప్రజలు అల్లాడుతున్న వేళ ఆదివారం ఉదయం నగరంలో భారీ వర్షం కురిసింది. రహదారులపై చెట్లు, హోర్డింగ్‌లు పడిపోయాయి. వర్ష బీభత్సానికి నగరంలోని వీధులు నీట మునిగాయి. పలుచోట్ల వాహనాలు మొరాయించాయి, నగరంలో రహదారులపై వాహనాలు బారులు తీరి కనిపించాయి. భానుడి ప్రతాపానికి ఆపసోపాలు పడుతున్న ప్రజలకు వర్షం కాస్త ఉపశమనమనిపించింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







వన్‌టౌన్‌లో నీట్ సందడి



కేబీఎన్ కళాశాల వద్ద గేట్ వేస్తున్న అధికారులు



కేబీఎన్ కళాశాలలో బయోమెట్రిక్ ధ్రువీకరిస్తున్న సిబ్బంది

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైద్య విద్యలో ప్రవేశానికి నిర్వహించే నీట్ పరీక్షతో వన్‌టౌన్‌లో సందడి నెలకొంది. వన్‌టౌన్‌లోని వివిధ విద్యా సంస్థల్లో ఈ పరీక్షను నిర్వహించారు. దీంతో ఆయా పరిసర ప్రాంతాలన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో రద్దీగా దర్శనమిచ్చాయి. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో కాన్వెంట్ వీధిలో ఉన్న అటికిన్సన్ హైస్కూల్, కొత్తపేట పోలీసుస్టేషన్ పరిధిలోని కాకరపర్తి భావనారాయణ కళాశాల, పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ తదితర ప్రాంగణాల్లో నీట్ పరీక్ష జరిగింది. అటికిన్సన్ హైస్కూల్‌లో 480, పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాలలో 960 మంది, కాకరపర్తి భావనారాయణ కళాశాలలో 720 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వెస్ట్ జోన్ ఏసీపీ దుర్గారావు ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్, కొత్తపేట సీఐ చిన్నకొండలరావు, ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, వారి వాహనాలతో ఆయా ప్రాంతాల్లో పలు మార్లు ట్రాఫిక్ రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. పోలీసు అధికారులు స్పందించి అప్పటికప్పుడు రాకపోకలను క్రమబద్ధీకరించారు.

అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ ట్రాన్స్‌కో 132 కేవీ ఉప కేంద్రం భవానీపురం ఆధునీకరణలో భాగంగా కొన్ని మార్పులు చేస్తున్నారు. ఆయా పనులను శరవేగంతో పూర్తి చేసేందుకు ఏపీ ట్రాన్స్‌కో ప్రణాళికాబద్ధంగా సమాయత్తం అయినట్లు ఏపీ ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఓఅండ్ఎం గుణదల) ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భవానీపురం విద్యుత్ సబ్ స్టేషన్ ఆధునీకరణ మార్పుల నిమిత్తం సోమవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు సాధారణ ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అయితే అత్యవసర పరిస్థితి ఉత్పన్నం అయినప్పుడు మాత్రమే విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సాయిబాబు, పక్కన నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగిస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.వి జ్ఞాన కేంద్రంలో ఆదివారం ఏపీ సెక్యూరిటీ గార్డ్స్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాయిబాబు మాట్లాడుతూ.. సెక్యూరిటీ గార్డ్స్‌కు కనీస వేతనం అమలు చేయాలని, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సెక్యూరిటీ గార్డ్స్‌తో సహా 50 లక్షల మంది కార్మికులు పనిచేసే షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు సవరించలేదన్నారు. వేతనాల కోడ్ పేరిట జాతీయ కనీస వేతనం పేరుతో కార్మికుల వేతనాలపై దాడి జరుగుతుందని చెప్పారు. ఈ నెల 10లోగా సదస్సులు, 17, 18 తేదీల్లో మోటార్ సైకిల్ జాతాలు నిర్వహించాలని, 20న సమ్మె సందర్భంగా నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ప్రజాభేరి సంతకాల ఉద్యమం



సంతకాల సేకరణ చేస్తున్న సీపీఎం నాయకులు

పటమట(విజయవాడతూర్పు): సామాన్య ప్రజలపై విద్యుత్ భారాలు తగ్గించాలని, సర్దుబాటు చార్జీలు వెంటనే రద్దుచేయాలని, స్మార్ట్‌మీటర్లు పెట్టి సామాన్య ప్రజలపై ఆర్థికభారం వేయవద్దని సీపీఎం ప్రజాభేరి సంతకాలు ఉద్యమాన్ని నిర్వహిస్తోందని సీపీఎం తూర్పు నగర కమిటీ సభ్యులు రాజు అన్నారు. ఆదివారం పటమటలంక 9వ డివిజన్‌లో సీపీఎం ప్రజా భేరి సంతకాల ఉద్యమంలో భాగంగా డోర్ టు డోర్ ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్‌ను ప్రైవేటీకరణ చేయవద్దని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో రూ.15,485 కోట్ల విద్యుత్ భారాలు జనంపై వేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకమైన విద్యుత్ భారాలు వ్యతిరేకించాలని ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు గుణదల విద్యుత్ సౌధ కార్యాలయం వద్ద జరిగే నిరసనలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సంతకాల సేకరణలో నాయకులు పానమాల మల్లికార్జునరావు, నరేంద్ర, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నటరాజుకు నాట్య వినోదం



విజయవాడకల్చరల్: నాట్యాచార్యుడు డాక్టర్ చింతారవి బాలకృష్ణ నృత్యశిక్షణలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించే కూచిపూడి నృత్య రంగ ప్రవేశం ఆదివారం ప్రారంభమైంది. తొలి రోజు కార్యక్రమంలో వల్లభజోస్యుల శ్రీదత్త ప్రదర్శించిన అంశాలు నేత్ర పర్వంగా సాగాయి. నర్తనగణపతి, చిందబరీశ్వర స్తవం, పదము, నగుమోము, థిల్లానా అంశాలను ప్రదర్శించారు. నృత్య సంప్రదాయాన్ని పాటించి లైవ్ కార్యక్రమంగా సాగిన కార్యక్రమంలో నట్టువాంగం డాక్టర్ చింతారవి బాలకృష్ణ, గాత్రం సీహెచ్ శ్రీనివాస్, మృదంగం పసుమర్తి హరినాథ్, వయోలిన్ పాలపర్తి ఆంజనేయులు, వేణువుతో కుమార్ బాబు సహకరించారు. వల్లభజోస్యుల పవన్, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు. శ్రీదత్త అరంగేట్రం సందర్భంగా సంగీత విద్వాంసుడు కుమార సూర్యనారాయణ. నాట్యాచార్యులు పసుమర్తి శ్రీనివాస్, సీహెచ్ అజయ్‌కుమార్, నాట్యాచారిణి యల్లా జోస్యుల అనురాధ, పద్మశ్రీ హేమంత్, ఉషామాధవిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.